సాక్షి
ఖమ్మం
సోమవారం । 5 । ఆగస్టు । 2024



ఎప్పుడు కూలుతాయో ఏమో?

ఖమ్మంలో శిథిలావస్థ భవనాలు భయపెడుతున్నాయి. వాటిని తొలగించాలని అధికారులు నిర్ణయించినా ఆచరణకు నోచుకోలేదు. 8లో



త్వరలో వైరాకు సీఎం?

వైరా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఈనెలలోనే సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిసింది. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జిల్లాస్థాయి అధికారులంతా సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

'భక్త రామదాసు' నీటి తరలింపునకు కృషి



తూముల వద్ద రాళ్లు తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

తిరుమలాయపాలెం: భక్తరామదాసు ప్రాజెక్ట్ ద్వారా విడుదల చేసిన పాలేరు జలాలతో చెరువులు నింపేందుకు ఇరిగేషన్ అధికారులు కృషి చేస్తున్నారు. ఈ మేరకు డీఈ బాణాల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు కాలువలను పరిశీలించారు. తూముల్లో రాళ్లు, చెట్లు అడ్డుగా ఉండగా జేసీబీ, లష్కర్ల సహాయంతో తొలగిస్తున్నారు. కాగా, ఆదివారం సాయంత్రానికి దమ్మాయిగూడెం వరకు నీరు చేరింది. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 రోజుల పాటు నిరంతరాయంగా భక్త రామదాసు ప్రాజెక్టు నీరు విడుదల అవుతుందని, మండలంలోని అన్ని చెరువులను నింపుతామని తెలిపారు. రైతులు కాలువలకు గండ్లు పెట్టడం, తూముల వద్ద రాళ్లు వెయ్యడం వంటి పనులు చేయొద్దని సూచించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు వ్యవసాయాధికారుల బదిలీల కౌన్సెలింగ్

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖ అధికారుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపి పర్యవేక్షణలో గుగుల్ మీట్ విధానంలో బదిలీల ప్రక్రియను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఆపై అధికారుల బదిలీలకు కూడా కౌన్సెలింగ్ ఉంటుందని సమాచారం.

శిక్షణకు డీఐఈఓ

ఖమ్మం సహకారనగర్ : డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ అంశంపై నిర్వహించే శిక్షణకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) కె.రవిబాబు వెళ్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు హైదరాబాద్‌లో శిక్షణ ఏర్పాటు చేశారు.

9 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

- ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహణ
- వివరాలు వెల్లడించిన నిర్వాహకులు



వివరాలు వెల్లడిస్తున్న నాగబత్తిని రవి, ఏఎస్ కుమార్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్ : నెల నెలా వెన్నెల ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి, అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(అర్క్స్) కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. అంతరించిపోతున్న నాటక రంగాన్ని బతికించేందుకే నెల నెలా వెన్నెల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజ చైతన్యమే లక్ష్యంగా నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు. నెల నెలా వెన్నెల ఏడో వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 9 నాటికలను ఎంపిక చేశామని తెలిపారు. రోజుకు మూడు నాటికలు ప్రదర్శిస్తామని చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రోజుకొకరు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ పోటీలను కళాభిమానులు, కళాకారులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అర్క్స్ సంస్థ కార్యదర్శి మోటమర్రి జగన్మోహన్ రావు, ఖమ్మం కళా పరిషత్ కార్యదర్శి వేల్పుల విజేత, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, మారుతి కొండల్ రావు, చెరుకుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకలు!



జిల్లాలోని పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థల ఖాతాలను రాష్ట్ర ఆడిట్ సంచాలకులు పరిశీలించారు. 2020 – 21 సంవత్సరానికి సంబంధించి ఈ సంస్థల ఖాతాలపై ఆడిట్ చేయగా.. కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ నేపథ్యాన ఆయా శాఖల అధికారులు లోపాలను సరిదిద్దాక సమాధానాలతో కూడిన నివేదికలను జిల్లా ఆడిట్ అధికారులకు అందజేయనున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఆడిట్‌లో శాఖల వారీగా చూపించిన ఆదాయ, వ్యయాలు

శాఖ	ఆదాయం (రూ.కోట్లలో)	వ్యయం (రూ.కోట్లలో)
జిల్లా పరిషత్	5.66	13.39
మండల పరిషత్‌లు	17.97	9.86
గ్రామ పంచాయతీలు	210.16	179.14
ఖమ్మం కార్పొరేషన్	576.50	516.73
మున్సిపాలిటీలు	196.78	166.56
వ్యవసాయ మార్కెట్ కమిటీలు	67.72	60.12
జిల్లా గ్రంథాలయాలు	3.18	3.43

- పీఆర్, కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఆడిట్
- 2020 – 21 సంవత్సరంలో ఖాతాలపై నివేదిక
- ఖమ్మం కార్పొరేషన్‌లోని పలు విభాగాల్లో లెక్కలపై అభ్యంతరం

ఖాతాల అంకెల్లో వ్యత్యాసం

ఖమ్మం కార్పొరేషన్‌కు సంబంధించి ట్రెజరీ ఖాతాలో చూపిన అంకెలు.. నగదు పుస్తకంలో తేడాలు గమనించారు. ఏఎస్‌డీ అండ్ ఈఎండీ ఖాతా ఫండ్‌ను పరిశీలించినప్పుడు నగదు పుస్తకం, పాస్ పుస్తకం ముగింపు నిల్వలు సరిపోలడం లేదని గమనించారు. దీనిని పరిశీలించగా.. అన్ క్యాష్డ్ చెక్ రూ.11,350 పరిగణనలోకి తీసుకోలేదని తేలింది.

రిజిస్టర్ నిర్వహణలో నిర్లక్ష్యం

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ దరఖాస్తుల రిజిస్టర్ నివేదిక ఏళ్ల తరబడి సరిగా నిర్వహించడం లేదని ఆడిట్ అధికారులు గుర్తించారు. నెలవారీ, వార్షిక సారాంశాలను చూపడం లేదు. అలాగే కమిషనర్ ద్వారా ధ్రువీకరించలేదు. సీడీఎంఏ సైట్‌లోని భవన నిర్మాణ అనుమతుల రికార్డుల ప్రకారం 1,748 దరఖాస్తులు రాగా.. రూ.26,15,44,952 వసూలు చేసినట్లు కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో నమోదైంది. అందులో 266 ఫైళ్లు తిరస్కరించారని, నాలుగు మంజూరు చేయకుండా ఉన్నారని గుర్తించారు. మిగిలిన 1,478 దరఖాస్తులు ఆమోదించారు. మంజూరైన ఫైళ్లకు సంబంధించిన రిజిస్టర్‌ను, కార్యాలయ కాపీలను కార్యనిర్వాహక అధికారులు నిర్వహించడం లేదు. దీంతో వార్షిక ఖాతాల్లో చూపించిన మొత్తాల కచ్చితత్వాన్ని బిల్డింగ్ అప్లికేషన్ రిజిస్టర్‌తో సరిపోల్చడం సాధ్యం కాదని అధికారులు తేల్చారు. ఆస్తి పన్ను డిమాండ్ రిజిస్టర్‌తో క్రాస్ చెక్ చేయడం కూడా కుదరడం లేదని గుర్తించారు. గతంలో కొన్ని మున్సిపాలిటీల్లో జరిగినట్లుగా బిల్డింగ్ దరఖాస్తులకు నకిలీ చలానాలను జత చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు నష్టం జరిగితే బాధ్యుల నుంచి రికవరీ చేయాలని సూచించారు.

నేటితో నేలమట్టం

- కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేతకు రంగం సిద్ధం
- హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ, ఎక్సిక్యూడ్ కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- నిమిషాల వ్యవధిలోనే నేలమట్టం కానున్న 8 టవర్లు



నేటితో కనుమరుగు కానున్న కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కూలింగ్ టవర్లు



టవర్లను పర్యవేక్షిస్తున్న ఎక్సిక్యూడ్ కంపెనీ డైరెక్టర్ ఆనంద్‌శర్మ

పాల్వంచ: పాల్వంచలోని కాలం చెల్లిన కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ పాత ప్లాంట్(ఓఅండ్‌ఎం)లోని కూలింగ్ టవర్లు కాలగర్భంలో కలిసిపోనున్నాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో ఒక్కోటి చొప్పున మొత్తం 8 టవర్లు కూల్చివేయనున్నారు. పాత ప్లాంట్ తొలగింపు కాంట్రాక్ట్ దక్కించుకున్న హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ.. టవర్ల కూల్చివేతను రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఎక్సిక్యూడ్ కంపెనీకి అప్పగించింది. కంపెనీ డైరెక్టర్ ఆనంద్ శర్మ సారథ్యంలో ఇంప్లోషన్ పద్ధతిలో ఒకే చోట కుప్పకూలేలా పేలుడు పదార్థాలను ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున ట్రాన్స్‌కో శాఖ నుంచి విద్యుత్ లైన్ల క్లియరెన్స్ రాగానే కూల్చివేతకు సిగ్నల్ ఇవ్వనున్నారు. ఆ వెంటనే నిమిషాల వ్యవధిలో ఎక్స్‌ప్లోజివ్స్ పేలి టవర్లు నేలమట్టం కానుండగా, ముందుగా 'ఎ'స్టేషన్‌లోని నాలుగు టవర్లు, తర్వాత 'బీ'స్టేషన్‌లోని రెండు, 'సీ'స్టేషన్‌లలోని మరో రెండు టవర్లు కూల్చివేయనున్నారు. టవర్ల శకలాలు దూరంగా పడకుండా అక్కడే కుప్పకూలేలా పిల్లర్ల చుట్టూ ఐరన్ మెస్‌లను ఏర్పాటు చేసి, క్లాత్‌తో సీల్ చేశారు. దీంతో కూలే సమయంలో ఎక్కడా ప్రమాదాలు వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కర్మాగారంలోని మిగతా విభాగాలను తుక్కుగా మార్చి తరలించడంతో చివరికి ఈ టవర్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదా?

జూలై 31వ తేదినే కూలింగ్ టవర్లను నేలమట్టం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పనులు చేసేందుకు అధికారులు సాహసించలేదని తెలుస్తోంది. అనుకోని ప్రమాదాలు జరిగితే అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుందని కూల్చివేతను నిలిపివేసినట్లు సమాచారం. కాగా ట్రాన్స్‌కో లైన్ల క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇక నేడు ముహూర్తం ఖరారు చేశారు.

1965–78 ప్రాంతంలో నిర్మాణం..

పాల్వంచ అంటే కేటీపీఎస్, దానిలో టవర్లు ఆనవాళ్లుగా చెప్పవచ్చు. 115 మీటర్ల ఎత్తులో ఉన్న ఇవి కొన్ని మైళ్లదూరం వరకు కనిపిస్తాయి. 1965–78 సంవత్సరంలో జపాన్ టెక్నాలజీతో కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని నిర్మించారు. ఏ,బీ,సీ, స్టేషన్లలోని 60 మెగావాట్ల సామర్థ కలిగిన 1,2,3,4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5,6,7,8 యూనిట్లు చేపట్టి... 720 మెగావాట్లతో రాష్ట్రానికి వెలుగులు పంచారు. ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్ టవర్ చొప్పున మొత్తం 8 నిర్మించారు. విద్యుదుత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించిన క్రమంలో వేడిని తగ్గించేందుకు కూలింగ్ టవర్లు ఉపయోగపడతాయి. నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంతో ఇప్పటికీ చెక్కుచెదరక పోవడం విశేషం. కాగా పలువురు టవర్ల ఫొటోలు తీసి సోషల్ మీడియాలో బైబై ఓల్డ్ ప్లాంట్.. కూలింగ్ టవర్లు అంటు పోస్టులు చేశారు. ఆది నుంచి వివాదాస్పదంగానే ఈ పనులు సాగుతుండగా, చిట్టచివరి అంకం కూడా పూర్తి కావొచ్చింది. కాగా టవర్ల కూల్చివేతపై సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.

పటిష్ట భద్రత నడుమ..

కూలింగ్ టవర్ల కూల్చివేతపై కర్మాగారం చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎ. అప్పాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్, జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేష్, ఎస్‌ఈ కిరణ్‌కుమార్‌లు టవర్ల కూల్చివేత ప్రాంతాలను పరిశీలించారు. సోమవారం ఉదయం కరకవాగు, అల్లూరిసెంటర్, పాండురంగాపురం రోడ్‌లలో ఎవరూ తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కర్మాగారంలోకి ఇతరులెవరూ రాకుండా అనుమతులు నిలిపివేశారు. కనీసం 200 మీటర్ల దూరం వరకు ఎవరూ వెళ్లొద్దని నిబంధనలు విధించారు. ఉదయం షిఫ్ట్ విధులకు వెళ్లే సిబ్బందిని కూడా నిలిపివేయనున్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం - పచ్చదనం

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 9 వరకు స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్సహించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

నిధుల విడుదలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- దళితబంధు పథకం అమలుతీరుపై పరిశీలన



చింతకాని : దళితబంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రెండో విడత నిధులు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఆదేశించారు. దళితబంధు పథకం రెండో విడత నిధుల విడుదలపై ఆదివారం ఆయన పలువురు అధికారులతో మాట్లాడారు. మొదటి విడత నిధులతో యూనిట్లు పొంది, విజయవంతంగా నడిపిస్తున్న లబ్ధిదారులను గుర్తించి రెండో విడత నిధుల పంపిణీకి అర్హుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. దళితబంధు పథకం అమలుకు గ్రామాల్లో నియమించిన ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో యూనిట్లను పరిశీలించాలన్నారు. చింతకాని మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల సంఖ్య, వారికి అందనున్న నగదు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. చింతకాని మండలంలో 1,888 మంది లబ్ధిదారులు 100 శాతం నిధులు పొందారని, మిగిలిన 1,574 మంది లబ్ధిదారులకు సుమారు రూ.30 కోట్లు రెండో విడతలో విడుదల చేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. వీరిలో రూ.లక్ష లోపు నగదు విడుదల చేయాల్సిన లబ్ధిదారులు 850 మంది కాగా, మిగిలిన వారికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల లోపు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. కాగా, తాను వారం రోజుల్లో చింతకాని మండలంలో పర్యటిస్తానని, ఈ లోగా రూ.30 కోట్ల నిధుల విడుదలకు ఏర్పాట్లు చేయాలని భట్టి ఆదేశించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు చింతకాని మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి దళితబంధు రెండో దశ నిధులకు అర్హుల జాబితా సిద్ధం చేయాలని చెప్పారు.

భూకబ్జాదారులను వదలొద్దు

- గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి



కూసుమంచిలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి/కూసుమంచి/ఖమ్మంరూరల్ : రైతుల భూములు ఆక్రమించుకుంటూ వారి ఆత్మహత్యకు కారణమవుతున్న కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీపీ సునీల్‌దత్‌కు సూచించారు. కూసుమంచిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన సీపీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై దృష్టి సారించాలన్నారు. కొందరు ప్రభుత్వ భూములను కూడా ఆక్రమించారని, వారు ఎంతటి వారైనా వదలొద్దని ఆదేశించారు. జిల్లాలో గంజాయి విక్రయాలు, వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం 161 మందికి రూ. 46.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో కొన్నేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పొందిన 18 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారు.

త్వరలో 4.50 లక్షల ఇళ్లు..

నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో సీసీ రోడ్లు, నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాను మంత్రి పొంగులేటి ప్రారంభించి మొక్కలు నాటారు. చెన్నారంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. 140 మందికి రూ.36.35 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల విలువైన ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ధరణిపై బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే రూ.22వేల కోట్లతో 4.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని, పాలేరులో అదనంగా ఇస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నీటిపారుదల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీఎంహెచ్ఓ మాలతీ, ఆర్డీఓ గణేష్, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, రమ్య, ఎంపీటీసీ ఉష, నాయకులు శాఖమూరి రమేష్, మట్టె గురవయ్య, బచ్చలకూరి నాగరాజు, సీతారాములు, భద్రయ్య, జానకిరామయ్య, కడియాల నరేష్, మానుకొండ వెంకటేశ్వర్లు, చాగంటి నారాయణ, సుల్తాన్ వీరబాబు, లక్ష్మణ్‌రావు, సైదులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలాల్లోనూ ప్రజావాణి

తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహణ

ఖమ్మం సహకారనగర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని నేటి నుంచి మండలాల్లోనూ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రజలు ప్రతీ సమస్య పరిష్కారానికి కలెక్టరేట్‌కు రాకుండా తహసీల్దార్ కార్యాలయాల్లోనే ప్రజావాణి నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సోమవారం నుంచి జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లోనూ ప్రజావాణి నిర్వహించనున్నారు.

సాయంత్రంలోగా ఆన్‌లైన్..

తహసీల్దార్ కార్యాలయాల్లో స్వీకరించిన దరఖాస్తులన్నీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. మండల స్థాయిలో జరిగే ప్రజావాణిలో అన్ని శాఖల మండల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. గతంలో మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించి సమస్యలు పరిష్కరించేవారు. కరోనా తర్వాత ఇది రద్దు కావడంతో ఫిర్యాదుదారులు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో బారులుదీరుతున్నారు. దీంతో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మండలాల్లోనూ ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించారు.

పరిష్కారం పైనే ఆశలు..

మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించినప్పుడు అనేక సమస్యలు పరిష్కారమయ్యేవి. రెవెన్యూ, పెన్షన్లు, సదరం సర్టిఫికెట్లు తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుతం కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఇకపై మండల స్థాయి ప్రజావాణికి వెళ్లి అక్కడ సమస్యలు పరిష్కారం కాకుంటే కలెక్టరేట్‌కు రావాలని అధికారులు అంటున్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లోనే..



నేటి నుంచి ప్రతి సోమవారం అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తాం. ప్రజలు అక్కడే దరఖాస్తులు సమర్పించాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ముజమ్మిల్ ఖాన్, కలెక్టర్

ఇక 'ప్రత్యేక'మే..

నేటితో ముగియనున్న ఎంపీటీసీల పాలన

- రేపు జెడ్పీటీసీల పదవీకాలం పూర్తి
- జిల్లాలో 289 మంది ఎంపీటీసీలు, 20 మంది జెడ్పీటీసీలు
- ఇక ప్రత్యేకాధికారులతోనే పనుల నిర్వహణ..



ఖమ్మంవన్‌టౌన్: జిల్లా, మండల పరిషత్‌ల పదవీకాలం ముగుస్తున్నందున త్వరలో ప్రత్యేక అధికారుల పాలనకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఇక జిల్లాలో సోమవారం మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, 6న జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుల పదవీకాలం ముగియనుంది. అయితే, స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం లేకపోవడంతో రోజువారీ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించనుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల పాలకవర్గాల పదవీకాలం పూర్తి అయింది. ఆయా జిల్లాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

నేడు.. రేపు లాస్ట్..

జిల్లాలో 20 మంది జెడ్పీటీసీ, 289 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. సోమవారంతో ఎంపీటీసీలు, 6వ తేదీన జెడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1న గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చింది. ఇప్పుడు పరిషత్‌ల్లో సైతం 7వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన రానుంది. జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బాధ్యతలు చేపడతారు. మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో ఏదో ఒక జిల్లా స్థాయి అధికారి మండల ప్రత్యేకాధికారిగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యాన వారికే మండల పరిషత్ బాధ్యతలను అప్పగిస్తారా... లేక మరో జిల్లాస్థాయి అధికారికి బాధ్యతలు అప్పగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే..

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే సూచనలు కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల అనంతరం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ ఊహించారు. కానీ వివిధ కారణాలతో అది వాయిదా పడింది. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఎన్నికలకు సిద్ధమైనా నిర్వహించే పరిస్థితి కానరావడం లేదు. రిజర్వేషన్లు, ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ లాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికే కనీసం రెండు నెలల సమయం పడుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పదేళ్ల పాటు ఒకే రిజర్వేషన్ కొనసాగేలా చట్టం తీసుకొచ్చింది. దాని ప్రకారం 2019లో ఎన్నికలు నిర్వహించింది. అయితే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి సర్కార్ ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తుందా.. లేదా చట్ట సవరణతో కొత్త రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలకు పోతుందా అనేది తేలాల్సి ఉంది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఏ విధంగా ఎన్నికలకు పోతుందోనని ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. పాత రిజర్వేషన్ ఉంటుందని, తామే పోటీ చేస్తామని కొందరు సిద్ధమవుతుండగా, రిజర్వేషన్లు మారుతాయనే చర్చ సైతం గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో తేలాలంటే మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే.

క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

మధిర: డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం మధిర మండలంలో పర్యటించనున్నారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు యండపల్లి గుట్టల వద్ద ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు.

పెద్దరాంపురం సమీపంలో మావోయిస్టుల బ్యానర్



రాంపురం సమీపంలో వెలిసిన మావోయిస్టు బ్యానర్

కొణిజర్ల: మండలంలోని పెద్ద రాంపురం గ్రామ సమీపంలో మావోయిస్టుల పేరుతో ఓ బ్యానర్ ఆదివారం దర్శనమిచ్చింది. 2024 జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని, ప్రజలపై మావోయిస్టు పార్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విప్లవ ప్రతిఘాతుక యుద్ధం ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించాలని, హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకంచాలని కోరుతూ సీపీఐ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ పేరుతో బ్యానర్ వెలిసింది. ఇది మండలంలో చర్చనీయాంశమైంది. వామపక్ష పార్టీల నాయకులు సైతం బ్యానర్ గురించి చర్చించుకుంటున్నారు. ఎస్ఐ శంకరరావు బ్యానర్‌ను పరిశీలించి పొలంలో నుంచి తీసి వేయించారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ఖమ్మంరూరల్: మండలంలోని జాన్‌బాద్‌తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు భూమిని ఆక్రమించేందుకు యత్నించారని మనస్తాపంతో పురుగులమందు తాగగా కుటుం సభ్యులు ఆస్పత్రికి తరలించారు. జాన్‌బాద్‌తండాకు చెందిన జాటోత్ వీరన్న, సురేశ్, దేవిక, చిన్ని, ఉపేందర్.. మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి ప్రోద్బలంతో తమ భూమిని సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్నారని వెంకటరెడ్డి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



విజయ్ మృతదేహం

వైరా: గేదెలు మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులోకి దిగిన గేదెలను బయటకు తోలుకొచ్చేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం నల్ల చెరువు వద్ద చోటుచేసుకుంది. సోమవరం గ్రామానికి చెందిన కంటెపూడి విజయ్ (50) నల్లచెరువు సమీపంలో గేదెలు మేపుతుండగా గేదె చెరువులో దిగింది. దానిని అదిలించేందుకు వెళ్లిన విజయ్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగి చనిపోయాడు. పక్కనే ఉన్న భార్య కేకలు వేసినా సమీపంలో ఎవరూ లేక పోవడంతో ఫలితం లేకుండా పోయింది. ఇటీవల చెరువులో మట్టి తోలకాల సందర్భంగా పెద్ద ఎత్తున తీసిన గుంతల్లో నీరు నిలిచి ఉండటం వల్ల అందులో పడి విజయ్ మృతి చెందాడని చెబుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ భాగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న బాలిక మృతి

వేంసూరు: మండలంలోని రామన్నపాలెంలో గత నెల 30వ తేదీన ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన చుక్క హరిబాబు ఇల్లు పూర్తి కాలిపోగా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చుక్క రోజా, చుక్క వైష్ణవి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న చుక్క వైష్ణవి (16) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది.

పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు !

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని బోనకల్ రోడ్డులో గల శ్రీరాంనగర్‌లో పేకాట (జూదం) ఆడుతుండగా ఖమ్మం అర్బన్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. శ్రీరాంనగర్‌లో 13వ వీధిలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసి నలుగురి నుంచి రూ. 2 వేలకు పైగా నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు మాత్రం వారి వివరాలు తెలిపేందుకు ఇష్టపడలేదు. వారిని స్టేషన్‌కు తరలించి నోటీసులు ఇచ్చి పంపినట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

ఎప్పుడు కూలుతాయో ఏమో?

- నగరంలో పలుచోట్ల భయపెడుతున్న శిథిల భవనాలు
- ఇటీవల పాత పోస్టాఫీస్ భవనం తొలగింపు
- ఆ తర్వాత దృష్టి సారించని కేఎంసీ యంత్రాంగం
- నోటీసులతో సరిపెడుతున్న పాలకవర్గం, అధికారులు



శిథిలావస్థకు చేరిన పాత మున్సిపల్ కార్యాలయ భవనం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలు భయపెడుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించి తొలగించాలని అధికార యంత్రాంగం, పాలకులు నిర్ణయం తీసుకున్నప్పటికీ అమలులో అడుగులు పడటం లేదు. ఎక్కడైనా శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలు కూలి ప్రమాదాలు జరిగిన సమయాన హడావుడి చేసే పాలకులు, అధికారులు ఆ తర్వాత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో పలు ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరినవి అనేకం ఉన్నాయి. ఇవి ఎప్పుడు కుప్పకూలి ప్రమాదాలకు కారణమవుతాయో తెలియడం లేదు. వాటిని తొలగించకపోగా.. కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు. భవనాల యజమానులకు నోటీసులతో సరిపెడుతున్న అధికారులు చర్యలు తీసుకోవడంలో మాత్రం అలసత్వం వహిస్తున్నారు. మూడేళ్లుగా శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలను తొలగించాలని కేఎంసీ అధికారులు నిర్ణయం తీసుకుంటున్నప్పటికీ ఇప్పటి వరకు పూర్తి చేయలేకపోయారు. తాజాగా నగరంలోని పాత మున్సిపాలిటీ సమీపాన ఉన్న పాత పోస్టాఫీస్ భవనాన్ని కేఎంసీ కమిషనర్ ఆదేశాలతో తొలగించారు. భవనం తొలగింపు సమయంలో నగరంలో శిథిలావస్థ భవనాలపై మరోసారి అధికారులు చర్యలు తీసుకుంటారని అంతా భావించినా అలా జరగకపోవడం గమనార్హం

పదుల సంఖ్యలో భవనాలు

నగరంలో పదుల సంఖ్యలో భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. వందకు పైగా భవనాలు, గోడలు శిథిలావస్థకు చేరినట్లు తెలుస్తోంది. ఇవన్నీ ప్రైవేట్ యజమానులకు సంబంధించిన భవనాలే. రెండేళ్ల కిందట ఈ భవనాలను గుర్తించినా.. వాటిలో కొన్నింటికి నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. నగరంలో శిథిలావస్థకు చేరి పూర్తిగా తొలగించాల్సిన భవనాలు 10కి పైగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నా.. ఇంకా ఎక్కువగానే భవనాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఈ భవనాలు ఎప్పుడు ప్రమాదాలకు గురవుతాయో తెలియని పరిస్థితి ఉంది. శిథిల భవనాలను గుర్తించినా అధికారులు వాటిని తొలగించడంలో నిర్లక్ష్యాన్ని వీడడం లేదనే విమర్శలు ఉన్నాయి. తక్షణమే ఈ భవనాలను తొలగించాలని నగర వాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ భవనాల పరిస్థితేంటి?

శిథిలావస్థకు చేరిన ప్రైవేట్ భవనాలకు నోటీసులు ఇచ్చి తొలగింపు చర్యలు చేపట్టిన అధికారులు ప్రభుత్వ భవనాల వైపు చూడటం లేదు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు నగరంలో అనేకం ఉన్నాయి. ఖమ్మం కార్పొరేషన్ పాత భవనం, పాత కలెక్టరేట్ వెనుక భాగం శిథిలావస్థలో ఉన్నాయి. జెడ్పీసెంటర్ సమీపాన మిగిలిన ప్రభుత్వ పాఠశాల భవనాలు ప్రమాదకర స్థితికి చేరాయి. అంతే కాక నగరంలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల భవనాలు, గోడలు, వీటితోపాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాల గదుల పరిస్థితి అలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్, కేఎంసీ కమిషనర్ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం ఇలాంటి భవనాలను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పాత భవనాలను గుర్తించాలని ఆదేశించాం..



నగరంలో శిథిలావస్థకు చేరిన పాత భవనాలను గుర్తించాలని అధికారులను ఆదేశించాం. ప్రైవేట్‌వే కాక ప్రభుత్వ భవనాలను గుర్తించి తొలగించాలని చెప్పాం. ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరితే తొలగించి కొత్త నిర్మాణాలకు ప్రతిపాదించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

–పునుకొల్లు నీరజ, నగర మేయర్

అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సీఎం?

- సీతారామ లింక్ కెనాల్ పనుల ప్రారంభోత్సవానికి రూ.99.16 కోట్లు
- రిజర్వాయర్ కాలువల ఆధునీకీకరణకు రూ.42.10 కోట్లు
- వంద పడకల ఆస్పత్రికి రూ.37.05 కోట్లు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్, అధికారులు

వైరా: వైరా నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఈనెలలోనే సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిసింది. సాగుకు ఇబ్బంది లేకుండా సాగర్ కాల్వల ద్వారా నీటి తరలింపుతోపాటు వైరా తదితర రిజర్వాయర్లలోకి గోదావరి జలాలు తీసుకొచ్చే సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తవుతున్న తరుణంలో ఆయన పలు పనులను ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖ అధికారులు హెలీప్యాడ్, బహిరంగ సభాస్థలి ఏర్పాట్లను ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కాగా, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మార్చి 13వ తేదీన వైరా రిజర్వాయర్ కుడి కాలువ సమీపంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రూ.99.16 కోట్ల అంచనాతో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నత్తనడకన సాగాయి. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారంలో మూడు రోజులు ఏన్కూరు మండలంలోని ఇమామ్‌నగర్‌లో సీతారామ కెనాల్ పనులను నిత్యం పర్యవేక్షించి, పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు పనులు పూర్తి చేయించారు.

వైరా రిజర్వాయర్ ఆధునికీకరణ..

కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరా రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులకు రూ.42.10 కోట్లు మంజూరు చేయించారు. ఎడమ కాలువ పరిధిలోని 9.5 కిలోమీటర్ల నుంచి 13.5 కిలో మీటర్ల వరకు.. కుడి కాలువ పరిధిలో 7.8 కిలో మీటర్ల నుంచి 20.8 కిలో మీటర్ల వరకు రెండు వైపులా సైడ్‌వాల్స్‌ల నిర్మాణం చేయాల్సి ఉండగా ఖర్చు తగ్గించే పనుల్లో భాగంగా రెండు వైపులా సీసీ లైనింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎడమ కాలువ పరిధిలో విప్పలమడక నుంచి లింగన్నపాలెం వరకు సీసీ లైనింగ్ పనులు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఆనుకుని ఉన్న ఆరు ఎకరాల స్థలంలో రూ.37.50 కోట్ల అంచనా వ్యయంతో వంద పడకల ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇటీవల కేవీ సీఎం ఎస్ఆర్ఐ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 14.4 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించగా ఆ స్థలంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో వైరాలో శంకుస్థాపన చేయనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా రూ.26.87 కోట్లు మంజూరవ్వగా పైపులైన్ నిర్మాణం, ట్యాంకుల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. కాగా, 50 వేల మంది హాజరయ్యేలా తుళ్లూరి కోటేశ్వరరావు పామాయిల్ తోట సమీపంలో 20 ఎకరాల స్థలం, హెలీప్యాడ్ కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురకుల కళాశాలతో పాటుగా మిట్టపల్లి గార్డెన్ సమీపంలో స్థలాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పమ్మి అశోక్, పణితి శ్రీను, పుచ్చకాయల వీరభద్రంతో పాటు ఆర్అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఏసీపీ ఎంఏ రెహమాన్, తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, సీఐ నునావత్ సాగర్, ఆర్అండ్‌బీ డీఈ విద్యాసాగర్, ఏఈ విశ్వనాథం, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తోడుగా ఉంటా
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, కేసీఆర్ ఆర్మీ, గులాబీ జెండాకు ఉన్న ధైర్యం, నీతి, నిజాయితీ ఏ పార్టీకీ లేదని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శ్రేణులకు పిలుపునిచ్చారు. చికున్‌గున్యాతో బాధపడుతూ ఇటీవల కోలుకొని ఖమ్మం వచ్చిన అజయ్‌కుమార్.. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఏ పిలుపు ఇచ్చినా రోడ్డుమీదకు వచ్చి ప్రజల కోసం కొట్లాడుదామని, ఆ సమయంలో నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. కేసీఆర్ పార్టీ పెట్టి తెలంగాణ సాధించారని, ప్రభుత్వం ఏర్పాటు చేసి ఎన్నో పథకాలతో ప్రజలకు సేవలందించారని తెలిపారు. పార్టీ అధికారంలో లేని ప్రస్తుత తరుణంలోనే కార్యకర్తలు, నాయకులు అండగా ఉండాలని అన్నారు. పదవుల కోసం పార్టీ మారే వారికి నిబద్ధత ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వారిని జైల్లో పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా కార్యకర్తలు భయపడొద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరు నాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దాదె అమృత, పల్లా రోస్‌లీనా, డోన్వాన్ సరస్వతి, పగడాల శ్రీవిద్య, రుద్రగాని శ్రీదేవి, కన్నం వైష్ణవి, పసుమర్తి రాంమోహన్, జ్యోతిరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, దనాల శ్రీకాంత్, తోట వీరభద్రం, కొత్త వెంకటేశ్వరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, మేకల సుగుణారావు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ నిర్వాకంపై ఫిర్యాదు

సత్తుపల్లిటౌన్: స్కానింగ్ కోసం వెళ్లిన గర్భిణికి ఒక స్కానింగ్‌కు బదులు మరో స్కానింగ్ చేసి అధిక నగదు వసూలు చేశారు. దీనిపై బాధితులు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన గర్భిణి ఎస్.ప్రవల్లిక టిఫా స్కానింగ్ కోసం పట్టణంలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌కు వెళ్లగా వారు ఫ్యాటల్ ఎకో స్కానింగ్ చేశారు. సంబంధం లేని స్కానింగ్‌తో అధిక డబ్బులు వసూలు చేశారని నిర్వాహకులను కుటుంబ సభ్యులు ప్రశ్నించటంతో గర్భిణి ని పడిగాపులు కాచేలా చేసి, వెనక్కి పంపించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదీగాక స్కానింగ్ సెంటర్ వైద్యుడికి క్షమాపణ పత్రం కూడా రాయాలని ఒత్తిడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాలికపై మైనర్ లైంగికదాడి

తల్లాడ: అభం శుభం తెలియని ఆరేళ్ల బాలికపై పదహారేళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన మండలంలోని వెంకట్రాముని తండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ బి.కొండల్‌రావు కథనం ప్రకారం.. ఆరేళ్ల బాలిక వీధిలో ఆడుకుంటుండగా అక్కడే ఉన్న బాలుడు ఇంట్లోకి ఎత్తుకెళ్లి లైంగికదాడి చేశారు. బాలిక అన్నయ్య చూసి తన తల్లికి చెప్పగా ఆమె బాలుడి ఇంటికి పరుగున వచ్చింది. గమనించిన బాలుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండల్‌రావు బాలికను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం

పాల్వంచ: బీటెక్ విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చీమల నంగయ్య చిన్న కుమారుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. జూలై 7వ తేదీన ఇంటికి వచ్చాడు. ఈ నెల 2వ తేదీన కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తెస్తానని బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అని వస్తోంది. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ శాఖలో త్వరలో పదోన్నతులు, బదిలీలు

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



వరుణ్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న శేషగిరిరావు దంపతులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు, బదిలీలు ఉంటాయని వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని చల్లపల్లి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన టీఈఈ 1104 యూనియన్ నాయకుడు తక్కెళ్లపల్లి శేషగిరి రావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో సీఎండీ మాట్లాడారు. వచ్చే అక్టోబర్ నాటికి 2,400 జూనియర్ లైన్లమెన్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సిబ్బందికి అన్ని రకాల భద్రత పరికరాలు అందించామని, ప్రమాదాలు జరగకుండా కార్మికులు, ఉద్యోగులు, అధికారులు వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ టి. సదర్‌లాల్, మాజీ డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ అధికారి జనార్దన్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సుధీర్, అదనపు కార్యదర్శి వి. వరప్రసాద్, అడ్వైజర్ జనార్దన్ రెడ్డి, రఘునందన్, ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు, బాబూరావు, హీరాలాల్, నాగేశ్వరరావు, భద్రు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ఘనీ మృతికి మంత్రుల నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు మహ్మద్ ముస్తఫా తండ్రి ఘనీ ఆదివారం అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందాడు. కాగా, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ముస్తఫా, ఆయన సతీమణి రఫీదాబేగంను ఓదార్చారు. తుంబూరు దయాకర్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, ముచ్చా విజయబాబు, దొండపాటి వెంకటేశ్వరరావు, పునుకొల్లు నీరజ, తుళ్లూరు బ్రహ్మయ్య, మిక్కిలినేని నరేంద్ర, సాధు రమేశ్‌రెడ్డి, మానుకొండ రాధాకిశోర్, తుపాకుల ఎలగొండస్వామి, మలీదు జగన్, వల్లబోయిన వెంకటేశ్వర్లు, బోడేపూడి రాజా, మియాభాయ్, ఉత్తేజ్ నాయక్ తదితరులున్నారు.

ఉత్సాహంగా స్నేహితుల క్రికెట్ మ్యాచ్



మ్యాచ్‌కు ముందు టాస్ వేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: ఎప్పుడో చదువుకున్నారు.. స్నేహితుల రోజు కలుసుకొని ఉత్సాహంగా క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఏన్కూరు మండలానికి చెందిన శ్రీరాంపుర్ – తిమ్మినేనిపాలెంనకు చెందిన మిత్రులు కలిసి చదువున్నారు. ఆదివారం స్నేహితుల రోజు కావడంతో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ ఆడారు. తమ క్రికెట్ జట్ల గెలుపు ముఖ్యం కాదని, కలుసుకోవడమే ప్రధానమని వారు చెప్పారు. మ్యాచ్ అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. మ్యాచ్‌ను జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, క్రికెట్ కోచ్ ఎండీ మతిన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫిక్ అహ్మద్, శోభన్ తదితరులు ప్రారంభించారు.

'డ్రగ్స్ మత్తులో భారతం'పై కవి సమ్మేళనం



కవికి ప్రశంసపత్రం అందజేస్తున్న సుంకరి రమేష్

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో అక్షరాల తోవ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'డ్రగ్స్ మత్తులో భారతం' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ మాట్లాడుతూ.. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇంకా కవి, గాయకులు కన్నెగంటి వెంకటయ్య, ఉపాధ్యాయుడు పొత్తూరి సీతారామారావు, మున్సిపల్ రిటైర్డ్ ఆర్ఐ బి. సత్యనారాయణ, సీత్లా నాయక్ తదితరులు సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో అక్షరాల తోవ నిర్వాహకులు, కవులు, రచయితలు, సాహితీ వేత్తలు దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, నామా పురుషోత్తం, సయ్యద్ షఫీ, దేవయ్య, గాజుల భారతి, మద్దినేని జ్యోతి, పంజాల ఐలయ్య ఇబ్రహీం, నిర్గుణ్, రావు బ్రహ్మం, కొత్తపల్లి కృష్ణారావు, రెంటాల చిన్న హుస్సేన్, శోభనాద్రి, రేళ్ల శ్రీనివాస్, మందుల వీరభద్రం, సబ్బు నాగయ్య రవి, కొమ్ము ఏ నాగేశ్వరరావు, దారా శ్రీకాంత్, కన్నెగంటి వీరబ్రహ్మయ్య చారి పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూలి వ్యక్తి మృతి



కూలిన గోడల మధ్య వెంకన్న మృతదేహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని తాతగుడి సెంటర్‌లో రేకులషెడ్డు కూలి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తాతగుడి సెంటర్‌లో వీరాంజనేయులు సాయిరామ్ టిఫిన్ సెంటర్ నడిపిస్తున్నాడు. అందులో పనిచేస్తున్న కత్తిబోయిన వెంకన్న (46).. టిఫిన్ సెంటర్ పక్కన ఉన్న సతీశ్‌కు చెందిన రేకులషెడ్డులో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మంచినీరు పట్టుకునేందుకు వెళ్లిన వెంకన్నపై ఒక్కసారిగా రేకుల షెడ్డు కుప్పకూలింది. దీంతో హోటల్ నిర్వాహకులు పోలీసులు, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని గోడల మధ్యలో ఇరుక్కున్న వెంకన్నను బయటకు తీశారు. కాగా, అప్పటికే వెంకన్న మృతి చెందినట్లు స్థానిక వైద్యులు ధ్రువీకరించారు. టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. హోటల్ నిర్వాహకులు, రేకుల షెడ్డు యజమాని సతీశ్ వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకన్న మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకన్న 18 ఏళ్ల వయసులో తమ హోటల్‌కు వచ్చాడని, అప్పటి నుంచి అన్నీ తామే అయ్యి చూసుకుంటున్నామని టిఫిన్ సెంటర్ నిర్వాహకులు వీరాంజనేయులు, ఆయన భార్య పద్మ, కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకన్న మృతితో వారు కన్నీటి పర్యంతమయ్యారు. టిఫిన్ సెంటర్ నిరాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శనివారం పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకోగా ఘటనా ప్రాంతంలో రెండు శక్తివంతమైన మందుపాతరలను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్లలో భాగంగా ఆదివారం నారాయణపూర్ జిల్లా కచ్చపాల్ సమీపంలోని అటవీప్రాంతంలోకి వెళ్లగా మావోయిస్టులు పోలీసు బలగాల పైకి కాల్పులు జరిపారు. పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఈ సందర్భంలో మావోయిస్టులు తప్పించుకోగా.. సుమారు 10 కిలోల సామర్థ్యం కలిగిన రెండు శక్తివంతమైన ముందుపాతరలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఇద్దరిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట, ములకలపల్లి క్రాస్‌రోడ్‌లో ఏసీపీ కార్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని చినతండాకు చెందిన బాణోత్ వెంకన్న, కొత్తూరుకు చెందిన ఆడెపు కౌసల్య ఆక్రమించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. ఏసీపీ కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించిన 20 కుంటల భూమిలో వారు షెడ్లు నిర్మించారని ఎస్ఐ వివరించారు.

పోలీసులమంటూ యువకులపై దాడి

కొత్తగూడెంటౌన్: పెనగడప పంచాయతీ సమీపంలో రీల్స్ చేసుకుంటున్న యువకులపై పోలీసుల మంటూ వచ్చిన కొందరు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పెనగడప సమీపంలో రీల్స్ చేసుకుంటున్న తమ వద్దకు టూటౌన్ పోలీసులమంటూ కారులో వచ్చిన ఆరుగురు కొట్టారని యువకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.